# వాయినాలు

జనవరి 20.

మూర్తిగారికి-

మీ కథ "ఇంతే సంగతులు" మా పత్రికలో ప్రచురణకు స్వీకరించలేదని తెలపడానికి చింతిస్తున్నాను. ఇది ఏవిధంగానూ మీ రచనా పాటవాన్ని, శక్తినీ, తక్కువ అంచనా వేయడం కాదనీ, భవిష్యత్తులో మీ 'కలం'నుండి అమూల్యమైన రచనలు ఇంకా పుంఖాను పుంఖాలుగా వెలువడి ఆంధ్ర పాఠకలోకాన్ని అలరించాలని మనసారా కోరుతూ-

సెలవ్.

సంపాదకుడు, "ఢమరుక"

పి. యస్:- తగినన్ని తపాలాబిళ్ళలు అంటించిన కవరు కథతోబాటు జతపరచనందున, మీ కథ త్రిప్పి పంపుటలేదు.

* * *

జనవరి, 30.

శర్మగారికి

ఆర్యా,

మీ కథానిక "చెప్పాల్సిందేమీలేదు" మాపత్రికలో ప్రచురణార్హత సంపాదించలేదని మీకు తెలియపరచడానికి నేను మిక్కిలి విచారిస్తున్నాను. శ్రద్ధగా.... పలుమార్లు పరిశీలించినమీదట ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని మీరు గమనింప ప్రార్థన. భవిష్యత్కాలంలోమంచి రచనలు చేసి మీరందించగలరని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను. సెలవ్.

సంపాదకుడు, "నగారా"

పెళ్ళిపందిరి చాలా సందడిగా ఉంది.

పిల్లలు ఒకటే కేరింతలు.... కాస్త పెద్దవాళ్ళు వీలు చూసుకుని తీరిగ్గా బాతాఖానీ వేస్తున్నారు.

"అబ్బబ్బ....ఏం అల్లరిరా బాబూ." విసుక్కున్నాడో పెద్దాయన.

"అదేమిటిలెండి. పెళ్ళంటేనే అల్లరి." కుర్రకారు జోక్ కట్ చేశాడు.

"మరీ చోద్యం. ఈ ఉదయం నుండీ బాజాలు.... భజంత్రీలు చెవుల్ని హోరెత్తించేస్తున్నాయి. క్షణం రికాం లేదు గదా."

"పెళ్ళికి బాజాలు అతిముఖ్యం. అసలు బాజాలు....భజంత్రీలు లేనిపెళ్ళి అదేం పెళ్ళండి. పెళ్ళంటేనే మంగళకరమాయె. మంగళ వాయిద్యాలు.... చప్పుళ్ళు లేకపోతే ఎలా?"

ఆ హడావుడిలో మూర్తిగారికి, శర్మగారిని ఎవరో పరిచయం చేశారు.

"అరరె.... నేను పెళ్ళికూతురు తాలూకు....మీరు?

"దిసేమ్." శర్మ నవ్వి సమాధానం ఇచ్చాడు.

మీరు "నగారా" లో కథలు చూస్తుంటారని నాకిపుడే తెలిసింది..... గ్లాడ్. చాలా సంతోషం."

"అదే గమ్మత్తు.... ప్రఖ్యాత కథల మాసపత్రిక "ఢమరుక్" సంపాదకులు మీరని ఈ సందర్భంలోనే తెలిసింది."

"భలేచిత్రంగా కలుసుకున్నామండీ"

శర్మ, మూర్తి మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు. భజంత్రీలు ఆగకుండా మోగుతున్నాయి. పిల్లలు తోచిన మేరకు అల్లరి చేస్తూనేఉన్నారు.